క్లుప్తంగా

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

కొందుర్గు: బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీఎస్పీ షాద్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి తట్టెపల్లి రాములు డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తంగెళ్లపల్లిలో బీసీలకు రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు హాజరై మాట్లాడారు. రాష్ట్రం, దేశంలోనూ మెజారిటీ జనాభా ఉన్న బీసీలకు యాభై శాతం రిజర్వేషన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీసీలు మేల్కొని రాజ్యస్థాపన చేస్తేనే బీసీలకు న్యాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ షాద్‌నగర్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు ప్రశాంత్, కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడు శ్రీను నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం అందజేత



కొందుర్గు: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలకు మహదేవ్‌పూర్‌కు చెందిన రవీందర్‌రెడ్డి రూ. 20 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించడం కోసం తన తండ్రి మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం తాను విరాళం అందచేశానని చెప్పారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గణేష్, జగదీశ్వర్‌గౌడ్, మానయ్య, లింగమయ్యగౌడ్, ఉపాధ్యాయులు ఉషశ్రీ, స్వాతి, శివలింగమ్మ పాల్గొన్నారు.

గడువులోగా కంటి అద్దాలు ఇవ్వండి

డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి



కొత్తూరు: అంధత్వ నివారణకు ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమస్యలున్న వారికి మందులు,కంటి అద్దాలు నిర్ణీత గడువులోగా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యుడు భరత్‌యాదవ్, తులసి, సరిత, హెల్త్‌ఎడ్యుకేటర్ శ్రీనివాసులు సిబ్బంది రవికుమార్, అమృత, గోవర్ధన్, పూజిత, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య శ్మశాన వాటిక వద్దంటూ ఆందోళన

చేవెళ్ల: మండలంలోని దామరగిద్ద గ్రామంలో జనవాసాల మధ్య శ్మశానవాటిక ఉండడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు అన్నారు. మండలకేంద్రంలోని ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో బుధవారం వారు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో హరిజనవాడ ఇళ్ల ముందు గతంలో పాత శ్మశానవాటిక ఉండేదని తెలిపారు. ప్రభుత్వం గ్రామానికి కొత్త శ్మశాన వాటికకు సర్వే నం.153లో రెండు ఎకరాల స్థలంలో కేటాయించిందని చెప్పారు. ప్రభుత్వం వైకుంఠధామంలో అన్ని సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. కానీ గ్రామస్తులు కొత్తగా ఏర్పా టు చేసిన శ్మశానవాటికకు వెళ్లకుండా పాత శ్మశాన వాటికలోనే అంత్యక్రియలు చేస్తున్నారని తెలిపారు. కావాలనే కొందరూ ఇలా చేస్తున్నారని దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి పరిష్కారం చూపించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రామస్వామి, మల్లేశ్, ప్రభాకర్, నవీన్, ఆనంద బి. నర్సింలు, రాజు, రాంచంద్రయ్య, ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామంలో ధన్నారం సుశీలమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ఐదువేల ఆర్థిక సహాయం మృతురాలి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జగన్‌నాయక్, శేఖర్, రవి, రేడ్యా తదితరులు పాల్గొన్నారు.

ఆటలకు చోటు కరువు!

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడామైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆట వస్తువులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూరు మండలంలోని ఆయా పాఠశాలల్లో క్రీడామైదానాలు లేక మైదానాలున్నా పాఠశాల్లో ఆటలకు అనువుగా లేని కారణంగా విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పలు సభల్లో ప్రజాప్రతినిధుల ఊకదంపుడు ఉపన్యాసాలు మాటలకే పరిమితం అవుతున్నాయి.

- వేధిస్తున్న క్రీడా పరికరాల కొరత
- ఆందోళనలో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు





పెంజర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతున్న విద్యార్థినులు, (ఇన్‌సెట్‌లో) అభివృద్ధి చేయని క్రీడామైదానం

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తామంటున్న పాలకుల హామీలు వాస్తవరూపం దాల్చడం లేదు. అభివృద్ధి మాట పక్కన పెడితే కనీస సౌకర్యాలు, వసతులు లేక విద్యార్థులు ఇబ్బందుల మధ్య చదువుకుంటున్నారు. పలు సమావేశాల్లో అధికారులు, పాలకులు చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచిస్తున్నారు. అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంగానే ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో అంతగా రాణించలేకపోతున్నారు. మండలంలోని కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ క్రీడా మైదానాలు లేవు. మరి కొన్ని పాఠశాలల్లో మైదానాలు ఉన్నప్పటికీ వాటిని ఆటలు ఆడడానికి అనువుగా అభివృద్ధి చేయలేదు. మరికొన్ని పాఠశాలల్లో మైదానాలు ఉన్నప్పటికీ వ్యాయామ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అయినప్పటికీ ఈ పరిస్థితిని అధిగమించడానికి అటు ప్రభుత్వం ఇటు విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు పాఠశాలల్లో కేవలం చదువులకు మాత్రమే పరిమితమవుతున్నారు.

అభివృద్ధి చెందని క్రీడామైదానాలు

కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో క్రీడా మైదానం చాలా ఇరుకుగా ఉంది. దీంతో విద్యార్థులకు కొన్ని ఆటల్లోనే వ్యాయామ ఉపాధ్యాయుడు శిక్షణ ఇస్తున్నాడు.

- ▲ గూడూరు జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో క్రీడామైదానం చాలా విస్తీర్ణం ఉన్నప్పటికీ అభివృద్ధి చేయక ఆటలకు అనువుగా లేదు..
- ▲ సిద్ధాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో క్రీడా మైదానమే లేదు. దీంతో విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటున్నారు.
- ▲ పెంజర్ల జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో విశాలమైన క్రీడా మైదానం ఉన్నప్పటికీ అక్కడ క్రీడలకు ఉపయోగకరమైన ఏర్పాట్లు మాత్రం లేవు.

క్రీడల్లో పెద్దగా రాణించని విద్యార్థులు..

చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించి వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో చక్కటి శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించింది. వారు ఆయా తరగతుల విద్యార్థులకు విడతల వారీగా ప్రతిరోజు ఒక్కో క్రీడలో శిక్షణ కల్పించాలి. కాగా, అలాంటి శిక్షణ పాఠశాలల్లో నామమాత్రంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఒకటి, రెండు పాఠశాలల్లోనే విద్యార్థులు కొన్ని జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చారు. కొందరు వ్యాయామ ఉపాధ్యాయులు సైతం ఏదో నామమాత్రంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో ఆసక్తి ఉన్న క్రీడలపై శిక్షణ ఇవ్వడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కారణంగా క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు సైతం ప్రోత్సాహం అందని కారణంగా ఆటలపై ఆసక్తి కనబర్చడం లేదు.

క్రీడామైదానాలను అభివృద్ధి చేయాలి



ప్రతి ప్రభుత్వ పాఠశాలలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహించాలి. క్రీడామైదానాలు లేని పాఠశాలల్లో మైదానాల ఏర్పాటుకు ప్రభుత్వం, విద్యాశాఖ వెంటనే చర్యలు తీసుకోవాలి.

– నరేష్‌చారి, ఏబీవీపీ నాయకుడు

ప్రతిపాదనలు పంపుతున్నాం



కొత్తూరు మండలంలో క్రీడామైదానాలు లేని పాఠశాలలను గుర్తిస్తున్నాం. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. మైదానాలు ఉన్నచోట విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

– కృష్ణారెడ్డి, ఎంఈఓ, కొత్తూరు

కంటి వెలుగుతో దృష్టి సమస్యలకు చెక్

డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి

చేవెళ్ల: కంటి వెలుగు కార్యక్రమంతో గ్రామాల్లోని ప్రజలకు కంటి సమస్యలు దూరం అవుతాయని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తల్లారం గ్రామంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సురేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చి ప్రతి గ్రామానికి వెళ్లి గ్రామంలోని ప్రజలందరికి కంటి పరీక్షలు చేయించడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరికీ పరీక్షలు చేసే వరకు శిబిరాలు గ్రామాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. తల్లారం, దుద్దాగు గ్రామాల ప్రజలు కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సమ్మ, కార్యదర్శి నషిరోద్దీన్, వార్డు సభ్యులు కంటివెలుగు శిబిరంలో డాక్టర్ సుష్మ, పీహెచ్ఎస్ శోభ, అప్తామిక్ ఆఫీసర్ సౌందర్య, ఎఎన్ఎం అనిత, ఆపరేటర్లు హరి, మంజుల, ఆశవర్కర్లు బందమ్మ , గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



కళ్ళద్దాలను అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ క్రిష్టారెడ్డి

కాషాయ జెండా ఎగరవేస్తాం

బీజేపీ జిల్లా నాయకులు జంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న యువమోర్చా జిల్లా కార్యదర్శి మహేందర్

షాబాద్: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మచన్‌పల్లి గ్రామంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ కూతురు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనపై ప్రజలు విసుగుచెందారని అన్నారు. తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందని, తెలంగాణ వచ్చినా బతుకులు మారలేదన్నారు. యువమోర్చా జిల్లా కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ...ఎంతో మంది విద్యార్థులు ఆత్మ బలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా మన బతుకులు మాత్రం మారలేదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు హరీష్, శ్రీశైలం, శివ, నవీన్, రాజు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: ఆపదలో ఉన్న సాటి మనిషిని ఆదుకోవడం ఎంతో గొప్ప విషయమని, మానవ సేవే మాధవ సేవ అని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం కొందుర్గు మండలం రామచంద్రాపూర్ చౌరస్తాలో రవీందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం రవీందర్‌రెడ్డి తండ్రి మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరు దానగుణం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కొందుర్గులో ఓ ప్రైవేట్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాజారామేశ్వర్ రెడ్డి, రామచంద్రయ్య, నర్సింహారెడ్డి, రంగయ్య, శ్రీశైలం, రాజ్‌కుమార్, గోపాల్, లింగం, రెడ్డి నర్సింలు, అలీమ్, జాహంగీర్, దర్గ రామచంద్రయ్య పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్‌లో నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, సర్పంచ్ బాల్‌రాజ్, నాయకులు బంగారు రాములు పాల్గొన్నారు.

భైరి నరేష్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలి

బజరంగ్‌దళ్ సభ్యుల డిమాండ్



నరేష్‌పై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కొత్తూరు: హిందు దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న భైరి నరేష్‌పై పోలీసులు వెంటనే పీడీయాక్ట్ నమోదు చేయాలని బజరంగ్‌దళ్ కొత్తూరు మండల సభ్యులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా వారు నరేష్‌కు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీసులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మనదేశంలో ఇతర కులాలు, మతాలను గౌరవించే సంప్రదాయం ఉందన్నారు. కాగా, నరేష్ ఓ సారి జైలుకు వెళ్లినప్పటికీ తన వైఖరిలో మార్పు లేదని, హిందువులను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఆయన ప్రసంగాలతో రాష్ట్రంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కుల, మతాల మధ్య చిచ్చు రగుల్చుతున్న నరేష్‌పై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌చారి, నరేష్‌చారి, శేఖర్‌గౌడ్, హర్షయాదవ్, ప్రవీణ్, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



భూమి పూజ చేస్తున్న మహేందర్‌గౌడ్, గురుస్వామి సతీష్‌నాయర్ తదితరులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని దాత నేరట్ల మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామ సమీపంలో అయ్యప్ప సన్నిదాన నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేసి సతీష్‌నాయర్ గురుస్వామితో కలిసి భూమి పూజ చేశారు. మాచన్‌పల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన అంతిరెడ్డిగూడకు చెందిన మహేందర్‌గౌడ్ గత సంవత్సరం నుంచి మాచన్‌పల్లి కట్ట మైసమ్మ దేవాలయ అభివృద్ధికి తన సొంత ఖర్చు రూ.50 లక్షలతో గుడి నిర్మాణ పనులు పూర్తి చేసిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప దీక్ష తనను ఎంతగానో ప్రభావితం చేసిందని చెప్పారు. ప్రతి ఒక్కరికి దైవభక్తి, దేశభక్తి, పితృభక్తి, సంఘభక్తి ఉండాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో దేవాలయాలు నిర్మించి పూజలు చేయడం అభినందనీయమని కొనియాడారు. మహేందర్‌గౌడ్‌ను ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గడ్డమీది వెంకటయ్య, సత్యరానాయణరెడ్డి, కుమార్, గిరీష్, సత్తయ్య, సురేందర్, రాజశేఖర్, నరేందర్, శివకుమార్, దేవేందర్, రమేష్, సంతు, శ్రీశైలం, తదితరులున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు న్యాయం చేయండి

సీఐటీయూసీ జిల్లా సహాయ అల్లి కార్యదర్శి దేవేందర్



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

చేవెళ్ల: అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేవెళ్ల ప్రాజెక్టు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్లు ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నారని వారికి ఇప్పటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కొత్తగా తీసుకువచ్చిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలనే డిమాండ్‌లతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా వీరి సమస్యలపై చాలా మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించారని కానీ చేవెళ్ల ఎమ్మెల్యే మాత్రం మాట్లాడలేదని తెలిపారు. అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై ఎవరు సహకరిస్తే వారికే రాబోయే ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలంతా కలిసి చేవెళ్ల లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

ఎఫ్‌సీఎన్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతా థామస్‌రెడ్డి



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ వ్యవస్థాపకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఎఫ్‌సీఎన్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతాథామస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామశివారులో ఉన్న ఎఫ్‌సీఎన్ (ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్) సంస్థలో బుధవారం కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 75 మంది బాధితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు బాధితులకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయంతో పాటుగా దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో కండరాల నొప్పులతో చాలా మంది పేదలు బాధపడుతున్నారని అన్నారు. వారందరు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు అనాథలను, అభాగ్యులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో స్లీవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'నట్టల' మందు తప్పనిసరిగా వేయించాలి

పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి



మేకలకు నట్టల నివారణ మందులను వేస్తున్న డాక్టర్ స్రవంతి

నందిగామ: మేకలు, గొర్రెలకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు కాపారులు ముందస్తుగా నట్టల నివారణ మందులను వేయించుకోవాలని పశువైద్య సిబ్బంది కిరణ్ సూచించారు. మండల పరిధిలోని మొత్కులగూడలో బుధవారం గొర్రెలకు, మేకలకు నట్టలనివారణ మందులు వేశారు. పశువైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి మంద వద్దకు చేరుకొని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి గొర్రె, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులను వేయించాలని సూచించారు. గ్రామంలోని 1708 జీవాలకు నట్టల నివారణ మందులను వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది అన్నపూర్ణ, గోపాల్, బాలయ్య,లింగం, కాపరులు పాల్గొన్నారు.

షాబాద్: మూగ జీవాలను కాపరులు కాపాడుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపూర్, తిమ్మారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, చర్లగూడ గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను తాగించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడుసార్లు నట్టల మందులను తప్పనిసరిగా తాపించాలన్నారు. పశువులు ఆరోగ్యంగా ఎదిగేందుకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు ఉన్నారు.

నీటిని వృథా చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఐజయ్య

కొందుర్గు: నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ ఐజయ్య పేర్కొన్నారు. బుధవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి సమావేశం నిర్వహించి జలశక్తి అభియాన్ ఉద్దేశం, అమలు తీరుపై వివరించారు. ఈ సందర్భంగా ఐజయ్య మా ట్లాడుతూ.. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 5 మండలాలను ఎంపిక చే యడం జరిగిందని, ఎంపిక చేసిన ప్రతి మండ లం నుంచి 10 గ్రామాలను ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వ హించడం జరుగుతుందన్నారు. నీటి ప్రాముఖ్యతపై ఈ సదస్సుల్లో అవగాహన కల్పించి జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు ఆంజనేయులు, మహేష్‌బాబు, ఎంపీఓలు లాలయ్య, విజయ్ కుమార్, ఏపీఓలు నర్సింగ్‌రావు, ప్రవళిక పాల్గొన్నారు.